# <u>తిక్కన కవితా రీతులు</u>

కవిత్రయంలో ద్వితీయుడు కవితా ప్రాభవంలో అద్వితీయుడు అయిన తిక్కన 13వ శతాబ్దానికి చెందిన వారు. తిక్కనకు కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు అనే బిరుదులు కలవు. నెల్లూరు ను పరిపాలించిన మనుమసిద్ధి వద్ద మంత్రిగా, ఆస్థాన కవిగా ఉండేవాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణము రచించి మనుమసిద్ధికి అంకితమిచ్చాడు. తిక్కన తల్లిదండ్రులు అన్నమ్మ, కొట్టరువు కొమ్మన. తిక్కన పితామహుడు మంత్రి భాస్కరుడు.

తిక్కన సమకాలికుడైన కేతన దశకుమార చరిత్రము రచించి తిక్కనకు అంకితం ఇచ్చాడు. అందులో తిక్కన వంశం గురించి, గుణముల గురించి, కవిత్వం గురించి వివరంగా వర్ణించాడు.

<u>తిక్కన కవితా లక్షణాలు</u>:

తిక్కన భారతంలో కింది లక్షణాలు కనిపిస్తాయి

<u>పాత్రచిత్రణ</u>:

తిక్కన పాత్ర చిత్రణ లో అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించారు. ప్రతి పాత్రను కళ్లకు కట్టినట్టుగా సజీవ చిత్రంగా మలిచారు

<u>ఉదాహరణ:</u> శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధర్మరాజు ,ద్రౌపది భీముడు, అర్జునుడు ఉత్తరుడు మొదలైన వారి పాత్రలను కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. ముఖ్యంగా ద్రౌపది పాత్రను "న భూతో న భవిష్యతి" అన్నట్లు తీర్చిదిద్దారు.

<u>నాటకీయత</u>:

తిక్కనది నాటకీయ శైలి. ఇది దృశ్య కావ్యానికి సంబంధించినది. పాత్రల సృష్టి ,సంభాషణలు నాటకీయతకు ప్రాణం వంటివి. తిక్కన నాటకీయతను ప్రదర్శించడంలో మిక్కిలి నేర్పరి.

<u>ఉదాహరణ:</u> విరాట, ఉద్యోగ పర్వాలను ఉత్తర గోగ్రహణం, కీచక వధ సంజయ, శ్రీకృష్ణరాయబార ఘట్టాలు, తిక్కన నాటకీయతకు తార్కాణాలు.

ద్రౌపది కీచకుని వలన పొందిన అవమానాన్ని భీమునికి చెప్పిన సందర్భంలో, భీముని కోపాన్ని, కీచకుని వికృత చేష్టలను, ద్రౌపది అలసటను, ఆవేదనను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

<u>వర్ణనా నైపుణ్యం:</u> తిక్కన వర్ణనలు సహజ సుందరంగా, సందర్భానుసారంగా ఉంటాయి. కథా గమనానికి భంగం కలగకుండా పాత్రల మనస్తత్వాలను వర్ణించడంలో లో తిక్కన సిద్ధహస్తుడు.

<u>ఉదాహరణ:</u>

ఉత్తర, అభిమన్యుల వివాహ ఘట్టం లో తిక్కన వర్ణనలు తెలుగువారి ఆచారాలను తెలియజేస్తాయి.

తిక్కన ప్రకృతిని వర్ణించేటప్పుడు కూడా కథకు అన్వయించి మనోహరంగా వర్ణిస్తాడు.

<u>అలంకారిక రచన:</u>

కావ్యానికి అందాన్ని చేకూర్చేవి అలంకారాలు. తిక్కన ఉపమ, రూపక, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి మొదలైన అలంకారాలను సందర్భానుసారంగా ప్రయోగించి తన రచనకు మరింత అందాన్ని చేకూర్చారు.

<u>ఉదాహరణ:</u>

"పూలు, పండ్లతో ఉన్న మహావృక్షాన్ని కూల్చే మదపుటేనుగులాగా భీముడు అనేక రత్న మణిహారాలను అలంకరించుకున్న కీచకుణ్ణి నేలకూల్చాడు". అని ఉపమాలంకారం తో వర్ణించాడు.

<u>రసాభ్యుచిత బంధం:</u>

తిక్కన విరాట పర్వం లో వీర,రౌద్ర,కరుణ, భీభత్స రసాలను అద్భుతంగా పోషించారు. భారతంలో శాంతం అంగి రసంగాను, మిగిలినవి అంగ రసాలుగా పోషించబడ్డాయి. <u>ఉదాహరణ:</u> విరాటుని కొలువులో ద్రౌపదికి జరిగిన పరాభవాన్ని విన్న భీముణ్ణి తిక్కన రౌద్ర మూర్తి గా చిత్రించాడు.

<u>భాషా శైలి:</u>

తిక్కన భాషా శైలి తేట తెలుగు మాటలతో, జాతీయాలతో లోకోక్తులతో, సామెతలతో అలరారుతుంది. <u>ఉదాహరణ:</u>
1.ప్రాణ ముల్ తీపన వినవే బృహన్నలా----,
2.నీయంబు తోయంబు నెరప నడిచి----- మొదలైన లోకోక్తులను తన కవిత్వంలో ఆణిముత్యాలుగా చేర్చాడు.

<u>కంద పద్య రచన:</u>

తిక్కన కంద పద్య రచనలో ఘనుడు అని ప్రసిద్ధి. తిక్కన ఎన్నో సూక్తులను, నీతులను కంద పద్యాలలో రచించాడు .<u>ఉదాహరణ:</u>

"తనువున విరిగిన----"

ఈ విధంగా తిక్కన పంచమ వేదమైన మహాభారతాన్ని పాత్రచిత్రణ సహజసిద్ధ వర్ణన అలంకార శోభ నాటకీయత రసపోషణ మొదలైన లక్షణాలతో రచించి ఆంధ్ర సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందాడు.